
# క్విట్ ఇండియా

దేవినేని శ్రీహర్ష



దీప్తి చక్కగా సర్దిన ఇల్లే మరో మారు సర్దుతోందన్న మాటే గాని ఆమె దృష్టంతా బయటే ఉంది కారు వచ్చే శబ్దం వినపడుతుందేమోనని ఎదురు చూస్తోంది. ఆమె ఆలోచనలన్నీ ఇంకొద్ది సేపట్లో రాబోయే నరేన్ చుట్టూతా పరిభ్రమిస్తున్నాయి. అతన్ని ఎప్పుడెప్పుడు చూస్తానా అని ఉందామెకు

"దీప్తీ' లోపలి నుండి వినవచ్చిన తల్లి పిలుపుకు "వస్తున్నా" అంటూ ఆమె దగ్గరకు వెళ్ళింది.

"నాన్నగారు అంకుల్ వాళ్ళను ఎయిర్‌పోర్ట్ నుండి తీసుకు వచ్చే వేళవుతోంది. ఆ చీరేమిటి, నువ్వేమిటి. ఏం లేనట్టు అది కట్టుకోకపోతే నాన్నగారు మొన్న కొనుక్కొచ్చిన చీర కట్టుకోకూడదూ" మందలిస్తున్నట్టుగా అంది వైజయంతి.

"ఫరవా లేదులే అమ్మా, వచ్చే వాళ్ళు మనకేమన్నా తెలియని వాళ్ళా ఏం. అయినా అసలు ఈ చీరకేమయ్యింది. బాగానే ఉందిగా".

వైజయంతి కూతుర్ని అలా మందలించినా లోలోపల అనుకుంది 'నా తల్లికేం కుందనపు బొమ్మ. ఎంత ఇష్టపడకపోతే దీప్తే తమ ఇంటి కోడలిగా రావాలని అంతగా తాపత్రయ పడతారు బలరామ్‌గారు కొంతకాలం ప్రక్క ప్రక్క పోర్షన్లలో కలసి ఉన్నప్పటి స్నేహం. ఆ స్నేహాన్ని బంధుత్వంగా మార్చుకోవాలని తమ కెంతగా ఉన్నా అబ్బాయి తమ కందుబాట్లో లేడన్నట్టుగా భావించి తమంత తాము అడగలేకపోయినా, అదేం పట్టించుకోకుండా "అబ్బాయి స్టేట్స్ నుండి అనుకోకుండా వచ్చాడు. నెల రోజుల్లో వెళ్ళిపోవాలంటున్నాడు. మళ్ళీ ఇప్పట్లో ఇండియాకు రావడం కుదరదట. వాడికి కూడ దీప్తినే చేసుకోవాలనుంది. మేము ముగ్గురం బయలుదేరి వస్తున్నాం. అన్ని విషయాలు మాట్లాడుకోవచ్చు" అని ఉత్తరం వ్రాసారు....

ఆమె ఆలోచనలు తెగకుండానే కారు వస్తున్న శబ్దం వినపడింది. దాంతో చేస్తున్న పనిని ఆపి సింక్‌లో చేయి కడుక్కుని గబగబా బయటకు వచ్చింది కారు దిగిన వాళ్ళకు ఎదురు వెళుతూ. "రండి అన్నయ్యగారూ, రండి వదినా" అంటూ భ్రమరాంబ చేతిని సాదరంగా అందుకుని ఆహ్వానించింది. నరేన్ కారు నుండి దిగకపోవడం గమనించి, కారులో అతనితో పాటు కూర్చున్న కమల్‌ను పిలుస్తూ "కమల్, బావగారిని లోనికి తీసుకురా" అంది వైజయంతి.

"రారంట. దీపక్క వచ్చి పిలిస్తేనే వస్తారంట. లేకపోతే వెనక్కి వెళ్ళిపోతానంటున్నారు" కమల్ మాటలకు నవ్వుకుంటూ మిగతా వాళ్ళను అనుసరించి ‌ ‌ ‌ ‌మె.

వంటింట్లో లేని పని కల్పించుకుని చేస్తున్నట్టు నటిస్తున్న కూతురిని చూసి నవ్వొచ్చింది వైజయంతికి. "చాల్లేగాని, బయటకు వెళ్ళి నరేన్‌నట లోపలికి రమ్మని ఆహ్వానించు. కార్లోనే ఉన్నాడింకా. నువ్వు వెళ్ళి స్వయంగా పిలవకపోతే అటునుంచటే వెళ్ళిపోతానంటున్నాడు"

దీప్తి మొహం సిగ్గుతో ఎర్ర బడింది. అమ్మతో మళ్ళీ చెప్పించుకోకుండా వంటింట్లో నుండి బయటకు వస్తూ తనకెదురొస్తున్న భ్రమరాంబను "బావున్నారా అత్తయ్యా" అంటూ పలకరించి, డ్రాయింగ్ రూంలోకి అడుగుపెట్టి "నమస్తే అంకుల్" చేతులు జోడించి బలరామ్ గారిని విష్ చేసి "ఇప్పుడే వస్తా"నని ఆయనకు చెప్పి బయటకు వచ్చింది.

అలా వెళ్తున్న దీప్తి వంక తృప్తిగా చూసింది భ్రమరాంబ. దీప్తి చాల అందంగా ఉంటుంది. చక్కని కనుముక్కుతీరు, అందచందాలకన్నా దీప్తిలో భ్రమరాంబను అయస్కాంతంలా ఆకర్షించే అంశం ఒకటుంది. అది ఆమె జడ. పొడుగ్గా ఉన్న జడ ఉన్నవాళ్ళు ఆమెకు బజార్లో ఎక్కడ కనిపించినా వాళ్ళు తనకు కనపడినంతమేరా అలా చూస్తుంటుందామె వాళ్ళను. అలాంటిది ఇంతవరకు తను చూసిన జడ లన్నింటికన్నా అందంగా, దాదాపు మోకాళ్ళ వరకు పొడుగ్గా ఉన్న జడ ఉన్న అమ్మాయి తన కోడలిగా వస్తోందన్న ఆలోచనే ఆమె కెంతో ఆనందాన్ని, అంతకుమించిన తృప్తిని కలిగిస్తోంది. అదీగాక దీప్తికన్నా ఎక్కువ చదువుకున్నవాళ్ళు, తను ఊహించనంత కట్న కానుకలు తెచ్చేవాళ్ళు తనకు దొరకవచ్చేమో కాని ఆమెలా బేలన్స్‌డ్‌గా ఆలోచించే మనిషి, మంచీ-చెడు, మర్యాదా-మన్ననా తెలిసిన వ్యక్తి తనకు దొరకకపోవచ్చు. అందుకే తమకు అంతగా తెలియని వ్యక్తిని కోడలిగా తెచ్చుకుని, ఒకవేళ మనస్తత్వాలు కలవక, ఆ వచ్చే వ్యక్తికి సర్దుకుపోయే స్వభావం లేకపోతే బాధపడే ఛాన్స్‌ను ఏమాత్రం తీసుకోదలచుకోలేదామె.

కొంగు భుజం చుట్టూ లాక్కుని, చిరునవ్వుతో కారు దగ్గరకు వచ్చి లోపలికి చూస్తూ అంది దీప్తి "బావున్నావా నరేన్. లోపలికి రా."

ఆ మాటలకేం జవాబు చెప్పకుండా ఆమె వంకే కళ్ళార్పకుండా చూస్తున్న నరేన్‌కు తన చేతిని అడ్డంపెట్టి "పద బావా... నాకు ఆకలవుతోంది. మా దీపక్కను అంతగా చూడాలనుకుంటే ఎదురుగా కూర్చుని భోంచేస్తూ చూద్దువుగాని" అన్న కమల్ మాటలకు ఇద్దరికీ నవ్వొచ్చింది.

అతను కారు దిగిన తర్వాత ఆమె వెనుదిరిగి ముందుకు వెళ్ళబోతుంటే ఆపి "ఇది నీకు" అంటూ చేతిలో ఉన్న గులాబీని ఆమె కందించాడు నరేన్.

తనకోసం తెచ్చిన ఆ గులాబీని అందుకుని, "థాంక్స్ నరేన్, గులాబీని ఇచ్చినందుకు కాదు. దానిని నా కోసం ప్రత్యేకంగా తెచ్చినందుకు" మనస్ఫూర్తిగా అంది దీప్తి.

"అసలు నేను వచ్చిందే నీ కోసం దీప్తీ" అభిమానంగా అన్నాడు నరేన్ ఆమె వంక ఆరాధనా పూర్వకంగా చూస్తూ.


కళ్ళముందు అసలు సిసలు తెలుగు సినిమాలో హీరో హీరోయిన్ల మధ్య జరిగే సంఘటనలా, సంభాషణల్లా అనిపించి అబ్బురంగా చూస్తున్నాడు కమల్ వాళ్ళిద్దరినీ.

అతని మాటలు ఆమెకు ఆనందాన్ని, సిగ్గునూ కలిగించాయి. వాటిని కప్పిపుచ్చుకుంటూ కమల్ చేయి పట్టుకుని "పద కమల్" అంటూ ముందుకు నడిచింది.

ఆ తర్వాత అందరికీ గంటలు నిముషాల్లా, నిముషాలు క్షణాల్లా గడిచాయి. కమల్ కోసం తను అమెరికానుండి తెచ్చిన రక రకాల వీడియో గేమ్స్, డ్రెస్‌లు ఇచ్చాడు నరేన్. భోజనాలయిన తర్వాత పెద్దవాళ్ళు కబుర్లలో పడ్డారు. కమల్, నరేన్ తెచ్చిన ఆట వస్తువులను తీసుకుని దగ్గర్లో ఉన్న ఫ్రెండ్స్ ఇంటికి వెళ్ళాడు. వాళ్ళకు చూపించడానికి.

డ్రాయింగ్ రూంలో ఒక ప్రక్కన నిలబెట్టి ఉన్న కేరమ్ బోర్డును చూస్తూ అన్నాడు నరేన్, "మనిద్దరం కేరమ్స్ ఆడుకుందామా దీప్తీ?"

అతని భయం అతనిది-తనను పెద్ద వాళ్ళతో వదిలేసో, లేకపోతే పడుకుని విశ్రాంతి తీసుకోమని చెప్పి దీప్తి వెళ్ళి వాళ్ళ అమ్మా వాళ్ళతో కూర్చుంటుందేమోనని. నరేన్‌కు ఆమెను వదిలి పెట్టాలని లేదు. సాధ్యమైనంత ఎక్ ‌ ‌కసేపు ఆమెతో గడపాలని అతని ప్రయత్నం. ‌ ‌నిని తాను గమనించినట్టుగా అతనివంక చూసి చిన్నగా



నవ్వుతూ అంగీకరించింది దీప్తి.

ఆట ఆడుతున్నంతసేపు నాజూగ్గా కదులుతున్న ఆమె చేతి వేళ్ల అందాన్ని, కాయిన్స్‌ను కొట్టబోయేముందు దీక్షగా చూస్తున్న ఆమె కళ్ల అందచందాల్ని ఆస్వాదించాడతను.

పూర్తి బోర్డు ఆడారు. ఓడిపోయిన తర్వాత, తన ఓటమిని అంగీకరిస్తూ ఆమె ఆటను మెచ్చుకుంటూ అన్నాడతను "నువ్వు చాల బాగా ఆడుతున్నావు దీప్తి"

"నువ్వు మాత్రం చిన్నప్పుడు తక్కువాట ఆడేవాడివా, నీకు ఇప్పుడు ప్రాక్టీసు లేదుగా. అయినా ఇవాళ నేను లేచినవేళ చాల మంచిది. నీ చేతుల్లో తన్నులు తినలేదు. చిన్నప్పుడు నువ్వొకసారి నాతో ఓడిపోయిన తర్వాత ఉక్రోషంతో నన్ను కొట్టావు గుర్తుందా?"

అతను నవ్వేడు. "ఓడిపోయినందుకు కాదు, ఆ రోజు నిన్ను కొట్టింది. నన్ను ఏమైనాసరే ఆటలో ఓడించాలన్న పంతంతో బోర్డుమీద ఉన్న నీ కాయిన్‌ను నాకు తెలియకుండా తీసి ప్రక్కన పెట్టి, అది అంతకుముందే వేసేసానని అబద్ధం చెప్పి రెట్టించినందుకు.

తనూ నవ్వేసి, "నువ్వారోజు కొట్టడం మంచిదే అయ్యింది నరేన్. అప్పట్నుండి ఇప్పటివరకు కనీసం అర అబద్ధమయినా ఆడలేదన్నది నిజంగా నిజం" అతని వంక అభిమానంగా చూస్తూ అంది దీప్తి.

టైమ్ చూసుకున్నాడతను. "నాలుగు కావస్తోంది. అలా బయటకు వెళ్దామా?" తలూపింది దీప్తి తనకేం అభ్యంతరం లేదన్నట్లు. అరగంటలో రెడీ అయ్యి ఇంట్లో చెప్పి బయలు దేరారు.

కారు దగ్గరకు వస్తూ అడిగాడు నరేన్ "నీకు డ్రైవింగ్ వచ్చా దీప్తి? రాకపోతే నేను నేర్పుతాను."

"ఆ అవకాశం నాకు లేదులే. ఎప్పుడయినా అవసరం వచ్చుని నాన్నగారు నేర్పించారు. చూడు నా డ్రైవింగ్ ఎలా ఉంటుందో" తనే డ్రైవింగ్ సీట్లో కూర్చుంటూ అంది దీప్తి.

ఆమెనే పరీక్షగా చూస్తూ అన్నాడు నరేన్, "నీకు జీన్స్, షర్ట్ బాగుంటాయి దీప్."

"నాకు చీరలో ఉంటేనే ఇష్టం. మిగతావన్నీ చాల కష్టం. అదిసరే ఆ పిలుపేమిటి చక్కగా దీప్తి అని పిలవక. లేకపోతే చిన్నప్పుడు నన్నేడిపిస్తూ పిలిచేవాడివే 'దీపీ' అని అలా పిలువు"

"అమెరికాలో ఇలా స్లోగా డ్రైవ్ చేస్తే ఫైన్ వేస్తారు"

"ఇది ఇండియాకదా! ఇక్కడ ఫాస్ట్‌గా వెళితే ఫైన్ వేస్తారు" నవ్వుతూ అందామె. "సరే ఎక్కడకు?"

"నీ ఇష్టం"

"నా ఇష్టం సరే... నీ ఇష్టం కూడ చెప్పు"

"ఎక్కడకయినా సరే కొంచెం తీరిగ్గా కూర్చుని మనం ఒకళ్ళ కళ్ళలోకి ఇంకొకళ్లు చూసుకుంటూ మాట్లాడుకోవడానికి వీలుండే చోటుకు. పోనీ ఏదయినా హోటల్‌కు వెళదాం ముందు. అక్కడ అరగంట గడిపి ఆ తర్వాత మళ్లీ ఆలోచిద్దాం ఎక్కడకు వెళ్లాలో."

"సరే" క్షణం మౌనంగా ఉండి అడిగింది దీప్తి "అమెరికన్ లైఫ్ ఎలా ఉంది నరేన్?"

"ఇక్కడకన్నా చాల బాగుంది. అక్కడి జీవితంతో పోలిస్తే ఇదో నరకం."

"మరి ఈ నరకాని కెందుకొచ్చావు?" కొంచెం సీరియస్‌గానే అడిగిందామె.

"ఇక్కడొక అమ్మాయుంది. ఆ అమ్మాయి అక్కడ రోజూ నా కలల్లోకి వస్తోంది. తనను ఇక్కడ్నుంచి తీసుకు వెళదామని."

"ఆ అమ్మాయికి అక్కడకు రావడం ఇష్టం లేకపోతే?"

అతను ఉలిక్కిపడి, అది ఆమెకు తెలియకుండా సర్దుకుని అన్నాడు.

"తను అలా అంటుందని నేననుకోవడం లేదు. నాకు తనంటే ఎంత ఇష్టమో, తనకూ నేనంటే అంత ఇష్టం ఉంటుందని నా నమ్మకం."

ఆమె ఏదో అనాలనుకుని, మళ్ళీ అంతలోనే ఆగిపోయి కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయింది. తర్వాత ఆ మౌనాన్ని తనే భగ్నం చేస్తూ అడిగింది.

"అంటే ఎప్పటికీ అమెరికాలోనే స్థిరపడాలనుకుంటున్నావా నరేన్?"

"ఊం"

"ఇండియాకు తిరిగి రావాలని లేదా నీ కసలు?"

"ఏముంది ఇక్కడ?"

"ఏమీలేదా?" సాలోచనగా అంది దీప్తి.

"అఫ్‌కోర్స్, నువ్వొకదానివి కనపడుతున్నావు"

కారు హోటల్‌లోకి తిరిగింది. పార్క్ చేసి దిగి లోనికి నడిచారిద్దరూ. బేరర్ వచ్చిన తర్వాత ఆమె నడిగి ఆర్డరిచ్చాడతను.

"చికాగో బాగుంటుందా నరేన్?" ఆసక్తిగా అడిగింది దీప్తి. "నాకు చాల ఇష్టం."

ఆమె మాటలకు నవ్వాడతను అర్థమయినట్లుగా. దీప్తి నరేన్ వంక సూటిగా చూస్తూ అంది "నువ్వుంటున్నావని కాదులే"

"నువ్వుండబోతున్నందుకా?"

దానికామె సమాధానం చెప్పలేదు. నవ్వి ఊరుకుంది. ఇంతలో బేరర్ వచ్చాడు. తర్వాత దీప్తి వాటిని తింటూ మౌనంగా ఉండిపోయింది.

అతనే అడిగాడు "ఏం మాట్లాడటం లేదేం?"

"ఏదో ఆలోచిస్తున్నాను."

"అదేమిటో నేను తెలుసుకోకూడదా?"

"తెలుసుకోకూడదా అని కాదు అడగాల్సింది. తెలుసుకోవచ్చా అని"

"ఎలాగయితేనేంలే నా భావం నీకు అర్థమయ్యిందికదా!"

"తర్వాత ఎక్కడకు వెళదామా అని. గుడికి వెళ్దామా?"

"నీ ఇష్టం"

నరేన్ బిల్ పే చేసాడు. బయటకు వచ్చిన తర్వాత అతను కారు వైపు వెళ్ళబోతుండగా అంది దీప్తి, "ఎదురుగా మేగజైన్ షాపుంది. అక్కడికి వెళ్ళొద్దాం."

తలూపాడతను. రోడ్ క్రాస్ చేసి ఆ షాప్ కెళ్ళారు. అక్కడ తమకు కావాల్సినవి తీసుకున్నారిద్దరూ. అక్కడ్నుండి తిరిగి వస్తుండగా అడిగింది దీప్తి తనను వేధిస్తున్న ప్రశ్నను "ఇండియాకు వచ్చి స్థిరపడటం నీకు సాధ్యపడదా నరేన్?"

"నువ్వెందు కంత పట్టుదలగా ఉన్నావో నా కర్థం కావడం లేదు దీప్తి. వై యు ఆర్ సో పర్టిక్యులర్ అబౌట్ ఇట్? యు కెన్ ఎంజాయ్ లైఫ్ యినెస్టేట్స్. అయినా నాతో జీవితాన్ని పంచుకోవడానికి ఇదో పెద్ద ఇష్యూలా కనపడుతోందా నీకు? డోంట్ బాదర్ అబౌట్ సచ్ థింగ్స్, దీప్తి, నువ్వంటే నాకు...."

అతను ఇంకా ఏదో చెప్పబోతున్నాడు. ఇంతలో వాళ్ళ దారికి అడ్డంగా ఒక అవిటి వ్యక్తి కర్ర సాయంతో ఎదురు వచ్చాడు. "బాబూ! రెండు రోజుల్నుండి అన్నం లేదు. కొంచెం ధర్మం చేయండయ్యా."

నరేన్‌కు ఆపుకోలేనంతగా కోపం వచ్చింది. "డర్టీ పీపుల్స్, డర్టీ కంట్రీ" అని అతడ్నించి తప్పించుకుంటూ, తనను దాటి కొంచెం ముందుకెళ్ళిన దీప్తి చేతిని తన చేతిలోకి తీసుకుని వస్తున్న వాహనాలను తప్పించుకుంటూ రోడ్‌ను క్రాస్ చేసాడు.

## కళ్లు

కలల కౌగిళ్ళు
వలపు వాకిళ్ళు!
కోర్కెల నెగళ్ళు
వయసు పరవళ్ళు!
సైగల సవాళ్ళు
ఆశల చివుళ్ళు!
ఊహల ఉయ్యాళ్ళు
ప్రేమ పొదరిళ్ళు!
కన్నీటి పుట్టిళ్ళు
బంధించు సంకెళ్ళు!
మనసు సవ్వళ్ళు
భావావేశ ఆనవాళ్ళు!
పాటల పందిళ్ళు
వినిపించు గజళ్ళు!
మరపించు నా ఒళ్ళు
మురిపించు నీ కళ్ళు!

-పుల్లాపంతుల వేంకటసుబ్బారావు

తర్వాత గుడికి వెళుతుండగా అంది దీప్తి "ఇంకేమన్నా చెప్పు నరేన్, అదిసరే ఫోర్త్ జనరేషన్, ఫిఫ్త్ జనరేషన్ కంప్యూటర్స్ అని చదివాను ఎక్కడో, అవేమిటసలు?"

ఆమె మామూలుగా మాట్లాడటంతో అతను కుదుట పడ్డాడు. అతను కూడ మామూలుగా అయ్యి అమె కర్థమయ్యేలా చెప్పసాగాడు.

గుడికి చేరుకున్న తర్వాత ఆమె గుడి చుట్టూ తిరిగి మూడుసార్లు ప్రదక్షిణం చేసింది. ఆమె చేతులు రెండూ జోడించి భక్తితో తిరిగితే, అతడు అమెతోపాటు గుడి గోడలపై పెయింట్ చేసిన దశావతారాల బొమ్మలను చూస్తూ తిరిగాడు.

తర్వాత ఆమె నరేన్ బయట తీసుకున్న కొబ్బరికాయను పూజారికిచ్చి అతను లోపల పూజ చేస్తుండగా, కళ్ళు మూసుకుని చేతులు జోడించి నాలుగైదు నిముషాలు ఏకాగ్రతతో, భక్తితో దేముడ్ని ధ్యానించింది. నరేన్ తన అలవాటు ప్రకారం ఒక నిముషం కళ్ళు మూసుకుని చేతులు జోడించి చెంప లేసుకుని ఆ తర్వాత ఆమెనే గమనించ సాగాడు. ఆ సమయంలో దీప్తి మొహంలో కదలాడుతున్న ప్రసన్నత అతడ్ని ముగ్ధుడ్ని చేసింది.

బయటకు వచ్చిన తర్వాత "ఈసారి నువ్వే డ్రైవ్ చేయి నరేన్. కాని 'బెటర్ లేట్ దేన్ నెవర్' అన్న విషయం గుర్తుంచుకో" అతడు అంతకు ముందు శన డ్రైవింగ్ గురించి అన్న మాటలు గుర్తుకొచ్చి అంది దీప్తి నవ్వుతూ. అతనూ నవ్వేసాడు.

ఇంటికి చేరుకున్న తర్వాత దీప్తి లోపలికి వెళ్ళి, ఐదు నిమిషాల తర్వాత మళ్ళీ తిరిగి కారు వైపు వెళ్ళటం చూసి అడిగింది వైజయంతి, "మళ్ళీ ఎక్కడకు దీప్తీ? అంకుల్ వాళ్ళు బజారు నుండి వచ్చేస్తారు."

"ఇప్పుడే ఓ గంటలోపు వచ్చేస్తానమ్మా. కొంచెం పనుంధి. మోహన వాళ్ళింటికే వెళ్ళేది. నరేన్ ప్లీజ్ ఎక్స్క్యూజ్ మి. తప్పని సరై వెళుతున్నాను."

"ఇట్సాల్ రైట్ దీప్తీ. కాని తొందరలో ఇందాక నువ్వు నాకు చెప్పిన విషయం మరచిపోకు. బెటర్ లేట్ దేన్ నెవర్" నవ్వుతూ అన్నాడు నరేన్.

అన్నట్లు గంటలోపే తిరిగి వచ్చింది దీప్తి. తరువాత బలరామ్ గారితోను, భ్రమరాంబతోను నవ్వుతూ, వాళ్ళను నవ్విస్తూ మాట్లాడింది. వాళ్ళ ముగ్గురికి తను గీసిన పెన్సిల్ స్కెచెస్, వేసిన పెయింటింగ్స్ చూపించింది. కాలేజిలో తనకు మొదటి బహుమతి సాధించి పెట్టిన 'జాతీయ సమైక్యత' అన్న విషయం మీద వేసిన పెయింటింగ్స్‌లో తను చెప్పాలనుకున్న దాన్ని ఏవిధంగా రంగుల కలయిక ద్వారా తెలియ చేసానో అర్థమయ్యేటట్లు చెప్పింది.

ఇదంతా అయిన తర్వాత కమల్ తను వేసిన బొమ్మలను తీసుకొచ్చి చూపించేసరికి వాళ్ళందరికీ ఆపుకోలేనంతగా నవ్వొచ్చింది. "మా బొండాం టీచర్" అన్న టైటిల్‌తో నవ్వొచ్చే విధంగా గీచిన ఆమె కేరికేచర్, "స్త్రీ చేసే ఇస్త్రీ" అన్న టైటిల్‌తో ఒక స్త్రీ తన భర్తను ఉతుకుతున్నట్లు గీచిన బొమ్మ అవి తమకు ఎప్పుడు గుర్తుకొచ్చినా నవ్వొచ్చి తీరుతుంది అనిపించాయి వాళ్ళకి. ఆ నవ్వులు ఆగినతర్వాత కమల్ కూల్‌గా చెప్పాడు. "ఇప్పుడు మీ అందరికీ నేనో రహస్యం చెప్పేస్తున్నాను. అంకుల్, ముందు మీరు ఆ తలుపు దగ్గర అడ్డం లేవండి. చెప్పంగానే నన్ను నేను రక్షించు కోవడానికి పారిపోవాలి. మీరెంతగానో ఎంజాయ్ చేసిన "స్త్రీ చేసే ఇస్త్రీ"కి ప్రేరణ నూటికి నూరుపాళ్ళూ మా అమ్మే."

ఆ తర్వాత ఆ ఇంట్లో దద్దరిల్లిన నవ్వు సద్దు మణగడానికి చాల టైమ్ పట్టింది.

భోజనాలయిన తర్వాత అసలు విషయం ప్రస్తావనకు తీసుకొచ్చారు దీప్తి నాన్నగారు. విషయం చెప్పి, "నేను అవసరం లేదు తనకు నరేనంటే ఇష్టమే అని చెప్పినా అంకుల్ వినడం లేదు దీప్తీ. నీ ఇష్టా ఇష్టాల్ని ఆయన స్వయంగా తెలుసుకోవా లనుకుంటున్నారు. నీ మనసులో ఏముందో చెప్పు."

దీప్తి రెండు మూడు క్షణాలు మాట్లాడ లేదు. ఆ తర్వాత నెమ్మదిగా లేచి లోపలి గదిలోకి వెళ్ళి టేప్ రికార్డర్ తీసుకొచ్చి ప్లగ్ పెట్టి "నా మనసులో ఏముందో ఇప్పుడు మీరందరూ వినండి అంకుల్. నేను చెప్పాలను కున్నది మామూలుగా చెప్పలేనేమోనని పించి సాయంకాలం రికార్డ్ చేసాను. అయితే నేను రికార్డ్ చేయని విషయం ఒకటి ఇప్పుడు చెపుతున్నాను అంకుల్. నేను రికార్డ్ చేసింది మీకు వినిపించడానికి నాదో కండిషన్ ఉంది. అది– అదంతా విన్న తర్వాత మీరు మీ మీ ఎమోషన్స్‌ను కంట్రోల్ చేసుకోవాలి. మీ అందరికీ నేనంటే ఉన్న ఇష్టం వల్లే ఈ విషయం గురించి ఇప్పుడిక్కడున్నారని తెలుసు. అలాగే ప్రతి ఇష్టానికి కొన్ని పరిమితులు, కొన్ని అవధులు ఉంటాయనీ తెలుసు. 'ఇది' విన్న తర్వాత మీరు మీ మీ ఎమోషన్స్ కంట్రోల్ చేసుకున్న దాన్ని బట్టి "నేనంటే మీకు ఇష్టం" అన్న విషయం మీద నేనేర్పరుచుకున్న నమ్మకానికి పునాదులు గట్టివో కాదో తెలుసుకుంటాను. అవి గట్టివి కావని తెలిసే పక్షంలో బహుశ మీకు నేనింక కనపడక పోవచ్చు. గట్టివే అని రుజువయితే ఈ టేప్‌లో మీరు వినే నా నిర్ణయానికి సడలింపు ఉంటుంది. అయితే ఇందుకు ఏ వ్యక్తి మనస్తత్వం వల్ల, ప్రవర్తన వల్ల నేను ఈ నిర్ణయానికి వచ్చానో ఆ వ్యక్తిలో పశ్చాత్తాపం వల్ల పూర్తి మార్పు– అదీ ఈ దేశానికి ఉపయోగపడే మార్పు రావాలి."

అందరూ ఆశ్చర్యంగా దీప్తి వంక చూస్తున్నారు– తాము ఎన్నడూ చూడని మనిషిని చూస్తున్నట్లు, ఎప్పుడూ చూసే మనిషిలో తాము ఎన్నడూ ఎరగని మనసును కనుగొన్నట్లు. దీప్తి నాన్నగారు దీప్తిని వారించ బోతుంటే బలరామ్ గారు అడ్డుపడ్డారు ఆయన భుజం తట్టి.

ఒకసారి భార్యవంక, నరేన్ వంక చూసి దీప్తి వంక వాత్సల్యంగా చూస్తూ "టేప్‌ను ఆన్ చేయి తల్లీ" అన్నారు నవ్వుతూ బలరామ్ గారు.

నరేన్‌కు ఏదో కొంచెం అర్థమయినట్లుగాను, చాల అర్థం కానట్లుగాను ఉంది. ఎందుకో తెలియని టెన్షన్‌ను ఫీలవుతున్నా, అతనూ తండ్రి మాటలకు తన అంగీకారాన్ని సూచిస్తున్నట్లు తల ఊపాడు. దీప్తి చాల రిలాక్సింగ్‌గా ఫీలయ్యింది. టేప్‌ను ఆన్ చేసి వచ్చి కుర్చీలో కూర్చుంది.

అక్కడంతా నిశ్శబ్దం అలుముకుంది. జడత్వానికి ప్రతీకలా ఉన్న ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ వస్తున్న నవ చైతన్యానికి మరోపేరులా టేప్ నుండి వినవస్తున్నాయి దీప్తి మాటలు.

"నరేన్,

నిన్న రాత్రంతా నాకు నిద్ర లేదు. అందరూ పడుకుని నిద్రపోతుంటే గదిలో లైటు తీసేసి కిటికీలోంచి బయట మసక వెలుతురులో తీలగా



## తెలుగు చిత్రంలో టి.వి. అర్జునుడు

ఇటీవల సినీ నిర్మాతలు కొంత మంది తమ చిత్రాల్లో టి.వి. నటీనటులను బుక్ చేసుకోవటంలో మోజు చూపుతున్నారు. 'రామాయణ్' ద్వారా సీతగా పేరొందిన దీపికను 'యమపాశం' చిత్రం తొలిసారిగా తెలుగు తెరకు పరిచయం చేసింది. అదే విధంగా 'మహాభారత్'లో అర్జునుడి పాత్రధారి అర్జున్ కూడా తెలుగు చిత్రంలో నటిస్తున్నాడు.

గతంలో కిలాడీకృష్ణుడు వంటి చిత్రాలను నిర్మించిన ఎం.ఎ. అజీజ్ తనస్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'అగ్నిసాక్షి'లో అర్జున్‌కు హీరోగా అవకాశం కల్పించాడు. అర్జున్ సరసన శాంతిలత హీరోయిన్‌గా నటిస్తోంది. తెలుగు అసలేరాని అర్జున్ హిందీలో డైలాగ్స్ వ్రాసుకొని చెప్పాడట. మరి ఈ చిత్రం అర్జున్‌కు ఏమాత్రం పేరు తెస్తుందో వేచిచూడాలి!

# క్విట్ ఇండియా

కనపడుతున్న చెట్లను, వాటిపై తన కాంతిని ప్రసరింప చేస్తున్న చంద్రుడ్ని చూస్తూ నిలుచున్నాను చాలసేపు. నా కళ్ళు చూస్తున్నది వాటినే అయినా నామనసంతా ఆక్రమించుకున్నది నువ్వూ, మనం ఎక్కువగా కలసి మెలసి ఉన్న మన బాల్యం.

మనం కలసి స్కూల్‌కు వెళ్లడం, సాయంకాలం పూట రకరకాల ఆటలు ఆడటం, నీ తో. లెక్కలు చెప్పించు కోవటం, అలా చెప్పించుకుంటూ మధ్య మధ్యలో నీతో మొట్టించు కోవటం. అసలు నీకు తెలుసా నరేన్, ఒకోసారి నాకు లెక్క అర్థమయినా అర్థం కానట్లు నటించే దాన్ని. నువ్వడిగినపుడు కావాలని జవాబు తప్పు చెప్పేదాన్ని. నీతో అలా మొట్టించు కోవడం నాకు బాగుండేది. ఒకోసారి నొప్పి అనిపించి ఏడుపొచ్చి ఏడ్చేస్తే నువ్వు గడ్డం పట్టుకుని బ్రతిమాలడం నాకు ఇంకా బాగుండేది.

ఇవాళ నువ్వు వచ్చిన దగ్గర్నుండి మనం సాయంకాలం బయటకు వెళ్లేవరకు నాకు నీతో ఉన్న ప్రతిక్షణం అపురూపంగా అనిపించింది. ఆ తర్వాత జరిగిన రెండు విషయాలు నా సంతోషాన్ని ఆవిరి చేసేసాయి.

నీకు గుర్తుండే ఉంటుంది. సాయంకాలం కేవలం కాలం గడపడం కోసం మనకు ఆకలిగా లేకపోయినా హోటల్‌కు వెళ్ళాం. మనం మేగజైన్స్ తీసుకుని వచ్చేటప్పుడు రెండు రోజుల నుండి తిండి లేదని ఒక అవిటి వ్యక్తి ధర్మం చేయమని ప్రాధేయపడ్డా బేరర్‌కు టిప్‌గా ఐదు రూపాయల నోటు ప్లేట్‌లో వదిలిన నువ్వు కనీసం ఐదు పైసలు అతనికివ్వ లేకపోయావు.

కష్టంలో ఉన్న సాటి మనిషి మీద ఆ మాత్రం దయ, జాలి, సానుభూతి, ప్రేమ చూపలేకపోతే మనుషులుగా మనకు విలువెక్కడుంటుంది నరేన్? మనిషి జన్మకు సార్థకత ఎక్కడుంది? నువ్వు నన్నడగొచ్చు. నన్ను ఇలా ప్రశ్నిస్తున్న నువ్వు అప్పుడే అతనికి ఎందుకు సాయం చేయలేక పోయావని. నీతో కలసి బయటకు వెళుతున్నప్పుడు నాకు డబ్బుతో అవసరం ఉండదని అనుకోవడం నా పొరపాటే అని ఒప్పుకుంటున్నాను.

అసలు ఏమిటి నీ గొప్ప నరేన్? విధి ఆ వ్యక్తిని చిన్న చూపు చూడకుండా ఉండి, నీకున్న అవకాశాలే అతనికి అందుబాటులో ఉంటే అతను నీ స్థితిలో ఉండేవాడుకాదా? ఇటీజ్ సోహేపెన్స్ దట్ హి ఈజ్ యిన్ దట్ పొజిషన్ అండ్ యుఆర్ యిన్‌దిస్ పొజిషన్. దీనిని కాదనగల ధైర్యం నీకుందా?

అతనికి సాయం చేయకపోగా 'డర్టీ పీపుల్, డర్టీ కంట్రీ' అని ఈసడించుకున్నావు. నువ్వు ఈ కంట్రీలో కాదా పుట్టింది నరేన్? మాతృభూమి కన్న తల్లి లాంటిదే. అలాంటిది ఈ మాటలు నువ్వు ఎలా అనగలిగావు? నీకు సిగ్గువేయడంలేదా నరేన్? 'ఏ దేశమేగినా, ఎందుకాలిడినా... పొగడరా నీ తల్లి భూమి భారతిని' అని చిన్నప్పుడు మనం మనస్కూల్లో గొంతెత్తిపాడాం, గుర్తులేదా నరేన్?

ఈ దేశపు గడ్డపై పుట్టి, ఈ దేశపుగాలి పీల్చి పెరిగి, ఈ దేశ ప్రజలతోనే ఈ మాటలు నువ్వన గలిగావంటే నీ సంస్కారం, నీ విజ్ఞత నాకు చాల బాగా అర్థమయ్యాయి. ఈ దేశపు సంస్కృతి నాకు ఉగ్గుపాలతో నేర్పిన శాంతి, సహనం నువ్వు ఈ మాటలన్న క్షణంలో నశించిపోయి నా రక్తం ఉడుకెత్తినా నా బాల్య స్నేహితుడి నుండి, నాకు తెలిసిన వ్యక్తి నుండి, అందులోను నా జీవిత భాగస్వామిగా ఎవరినయితే ఎంచుకోవా లనుకున్నానో ఆ వ్యక్తి నోటి నుండే విన్నందువల్ల కలిగిన దిగ్భ్రమలో నిన్నేమీ చేయలేక పోయాను. ఆ సమయంలో నా హేండ్‌బేగ్‌లో నువ్వు ఏ దేశంతో అయితే నా దేశాన్ని నాతో ఉన్న ఆ కొద్దిసేపు పోల్చి ఎగతాళిగా మాట్లాడావో ఆ దేశపు స్త్రీలకుమల్లే తమ ఆత్మరక్షణార్థం ఒక రివాల్వర్ ఉంచుకున్నట్లయితే, ఆ క్షణంలోనే మరేమీ ఆలోచించకుండా దాంతో నిన్ను షూట్‌చేసి చంపేసేదాన్నేమో!

నీ మీద నాకు చాల ఇష్టం ఉండటానికి ఇంకో ముఖ్యకారణం ఉంది. నీకు తెలుసా నరేన్!

అది నీ పేరు న... రే... న్. ఈ మూడు అక్షరాల కలయికతో ఏర్పడ్డ ఆ పేరన్నా, ఆ పేరుగల వ్యక్తి (వివేకానందుడు) ఈ దేశానికి గడించిన ఖ్యాతి, ప్రపంచదేశాల్లో ఈ దేశానికి పునః ప్రతిష్ఠించిన ఔన్నత్యం, గౌరవం గుర్తుకు తెచ్చుకున్నా నామేను సంతోషంతో, ఆనందంతో పులకరిస్తుంది.

అలాంటి గొప్పవ్యక్తి పేరు పెట్టుకున్న నువ్వు నా దేశాన్ని నా ముందు అవమానించినట్లే, నువ్వు ఇష్టపడే ఆ దేశానికి తిరిగి వెళ్ళిన తర్వాత ఆ దేశ ప్రజల ముందు కూడ తూలనాడితే వివేకానందుడి గురించి చూచాయగా విన్న ఏ వ్యక్తయినా నిన్ను పిచ్చివాడ్ని చూసినట్లు చూస్తాడు.

నరేన్ ఈ దేశపు గడ్డపై పుట్టిన నువ్వు ఇంత నీచంగా మాట్లాడటానికి సిగ్గుపడక పోయినా, నీలాంటి పుత్రుల్ని కన్నందుకు ఈ దేశమాత సిగ్గుపడుతోంది.

ఇది నీకు చిన్న విషయంలా కనిపించవచ్చు. కాని నాకలా కాదు. అందుకే నరేన్ నేను ఈ నిర్ణయం తీసుకుంటున్నది. ఇది నీకు కోపం కలిగించవచ్చు. నా మీద ద్వేషం రగిలించవచ్చు. మన కుటుంబాల మధ్య ఇన్ని సంవత్సరాలుగా ఉన్న స్నేహం, సఖ్యత, సుహృద్భావం అంతరించి పోవచ్చు. వీటన్నిటికీ నేను సిద్ధమే. కారణం నా అంతరాత్మను నేను మభ్యపెట్టుకోలేక పోవడం, నా మనసును నేను సమాధాన పరచుకోలేక పోవడం, ఇప్పటి వరకు సజీవంగా ఉన్న మన చిన్ననాటి స్నేహం, నాకు తెలియకుండానే నేను నీ మీద పెంచుకున్న అభిమానం, మమకారం ఇవేమీ నా నిర్ణయం మీద తమ ప్రభావాన్ని చూపించలేక పోవడాన్నిబట్టే ఈ సంఘటన నన్నెంతగా గాయపరిచిందో, మరెంతగా బాధపెట్టిందో నువ్వర్థం చేసుకోవచ్చు. నా నేస్తంగా నిన్నెప్పటికీ నేను అభిమానిస్తాను. కాని నా జీవితకాలం నాకు తోడు నిలచే వ్యక్తిగా నిన్ను అంగకరించలేను.

ఇదంతా ఇలా అందరి ముందు చెప్పడం, నిన్ను ఈ విధంగా నిలదీయడం నువ్వు అవమానంగా భావించవచ్చు. కాని దానికి లక్షల కోట్ల రెట్లు నీ వల్ల నా మాతృభూమికి అవమానం జరిగింది.

నువ్వు ఎప్పుడయితే ఆ మాటలన్నావో ఆ క్షణంలోనే ఈ దేశపు గాలిని పీల్చే హక్కు, ఈ దేశపు గడ్డపై నిలచే అర్హత కోల్పోయావు.

అందుకే అంటున్నాను–

గెటవే ఫ్రమ్ దిస్ హోలీలాండ్'

క్విట్ ఇండియా నరేన్, క్విట్ ఇండియా''

○

